క్లుప్తంగా

దుకాణాదారులకు జరిమానా

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలోని తెలంగాణచౌరస్తా నుంచి అంబేద్కర్‌చౌరస్తా వరకు మంగళవారం మున్సిపల్ అధికారులు వివిధ దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోడ్డుపై చెత్త వేసినందుకు గానూ ముగ్గురు యజమానులకు రూ.3,500 జరిమానా విధించారు. కార్యక్రమంలో హెల్త్ ఇన్‌స్పెక్టర్ (హెచ్‌ఐ) పి.వజ్రకుమార్‌రెడ్డి, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ (ఈఈ) చరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరం

హన్వాడ: మండలకేంద్రంలోని ఏపీజీవీబీలో మంగళవారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంవీ రూరల్ ఫోక్ ఆర్ట్ ఆర్గనైజేషన్ కర్నూల్ వారిచే బ్యాంకు పథకాల గురించి ప్రజలకు వివరించారు. బ్యాంక్ మేనేజర్ రామారావు, క్యాషియర్ రమ్యశ్రీ, కళాజాతా రాఘవేందర్, రాజేష్ పాల్గొన్నారు.

హన్వాడలో కొండచిలువ పట్టివేత

హన్వాడ: మండలకేంద్రంలోని రైతువేదిక వెనుక కుండలు తయారీ చేసే ప్రాంతంలో కొండచిలువను అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. మట్టికుండలు తయారు చేసే శ్రీను కొండచిలువను గుర్తించి ఎంపీపీ బాల్‌రాజుకు సమాచారం ఇవ్వడంతో ఈమేరకు అటవీశాఖ అధికారులకు తెలిపారు. దీంతో సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లి కొండచిలువను పట్టుకుని పిల్లలమర్రికి తరలించారు.

కళ్లకు గంతలతో నిరసన

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ధర్నాచౌక్‌లో 7వ రోజు సమగ్రశిక్ష ఉద్యోగులు మంగళవారం కళ్లకు గంతలతో నిరసన తెలిపారు. ఈమేరకు పలువురు నాయకులు మాట్లాడుతూ తమ శ్రమను ప్రభుత్వం గుర్తించి వెంటనే రెగ్యులరైజేషన్ చేయాలని డిమాండ్ చేశారు. శ్రీనివాస్, హర్షకుమార్, యాదగిరి, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులర్ చేయాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: కాంట్రాక్టు అధ్యాపకులను వెంటనే రెగ్యులర్ చేయాలన్న డిమాండ్‌తో పీయూ ముఖద్వారం వద్ద మంగళవారం నిరసన చేపట్టారు. కార్యక్రమంలో భూమయ్య, రవికుమార్, విజయ్‌భాస్కర్, అర్జున్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పారిశుద్ధ్య చర్యల్లో భాగంగా మంగళవారం స్థానిక 6వ వార్డు పరిధిలోని శ్రీనివాసకాలనీలో మున్సిపల్ సిబ్బంది ప్రత్యేక వాహనం ద్వారా ఫాగింగ్ చేపట్టారు. అలాగే 13వ వార్డు పరిధిలోని గొల్లబండతండాలో డెంగీ కేసు నమోదు కావడంతో ఫాగింగ్‌తో పాటు బ్లీచింగ్ పౌడర్ చల్లారు.

వినతిపత్రం సమర్పణ

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరుతూ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్ ఆధ్వర్యంలో మంగళవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద వినతిపత్రం సమర్పించారు. కృష్ణ, విజయ్‌కుమార్, నర్సింహులు, రాజు, శివ, బాలస్వామి, నరేష్, యాదమ్మ పాల్గొన్నారు.

పోస్టర్ల విడుదల

స్టేషన్ మహబూబ్‌నగర్: మిలాద్ ఉన్ నబీ వేడుకలను పురస్కరించుకొని హైదరాబాద్‌లో మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు మౌలానా అబిద్ హుస్సేన్, బజ్మె కాజ్మియ ఖాద్రీయ జిల్లా అధ్యక్షుడు జహంగీర్‌పాష ఖాద్రీ తెలిపారు. రక్తదాన శిబిరం పోస్టర్లను మంగళవారం జిల్లా కేంద్రం షాసాబ్‌గుట్టలో విడుదల చేశారు. ముఖ్య అతిథులుగా సయ్యద్ అఫ్రోజ్‌షా ఖాద్రీ, జఫర్‌షా ఖాద్రీ, వాసిఫ్ షాఖాద్రీ తదితరులు పాల్గొన్నారు. ఆసక్తిగల వారు శిబిరంలో పాల్గొనాలని, మిగతా వివరాల కోసం 9849301171 నంబర్‌ను సంప్రదించాలని కోరారు. ఖాజా మైనద్దీన్ ఖాద్రీ, ఇలియాజ్ ముజాహిద్, మీర్ షోయబ్‌అలీ, మహ్మద్ మొయిజ్ ఖాద్రీ, అలీం, ఎండి.ఖాజా తదితరులు పాల్గొన్నారు.

జీతాలు చెల్లించాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: తెలంగాణలో దాదాపు 20 జిల్లాల ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇంతవరకు ప్రభుత్వం జీతాలు చెల్లించకపోవడం ఎంతవరకు సమంజసమని ఆల్‌మేవా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుఖ్ హుస్సేన్ మంగళవారం ఓ ప్రకటనలో ప్రశ్నించారు. నాలుగేళ్లుగా ఉద్యోగుల ఆర్థికపరమైన సమస్యలు పరిష్కరించకుండా తీవ్రజాప్యం చేస్తున్నారని అన్నారు. సగం నెల పూర్తి అవుతున్నప్పటికీ జీతాలు చెల్లించకపోవడంతో ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వివరించారు.

27న నిమ్మజ్జనోత్సవం

జడ్చర్ల: పట్టణంలో ఈనెల 27న గణేష్ నిమజ్జనోత్సవం నిర్వహించనున్నట్లు వీహెచ్‌పీ బజరంగ్‌దళ్ పట్టణ అధ్యక్షుడు నిఖిల్ తెలిపారు. మంగళవారం జరిగిన సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. కాగా తొమ్మిది రోజులు ఉత్సవాలు నిర్వహించాలన్న నిర్ణయంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. చాలా కమిటీలకు సమాచారం ఇవ్వకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారని పలువురు పేర్కొన్నారు.

పల్లెలే దేశానికి పట్టుకొమ్మలు



కలెక్టర్ చేతుల మీదుగా పురస్కారాలు అందుకుంటున్న సర్పంచ్‌లు

సాక్షి నెట్‌వర్క్: పల్లెలే దేశానికి పట్టుకొమ్మలని కలెక్టర్ రవి నాయక్ అన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ 2023 గ్రామీణ ఉత్తమ ప్రతిభ పురస్కారాలకు జిల్లాలోని 11 పంచాయతీలు ఎంపికైన సందర్భంగా మంగళవారం మాట్లాడారు. సర్పంచులకు పురస్కారాలకు అందజేశారు. 11 పంచాయతీలు ఎంపిక కావడం సంతోషంగా ఉందని జిల్లాపేరు దేశ వ్యాప్తంగా వినిపిస్తుందన్నారు. ఇదే స్ఫూర్తితో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా కోడూర్, కాటవరం, పెద్దదర్పల్లి, పెద్దయాపల్లి, మల్లాపూర్, గుండ్లపొట్లపల్లి, తిరుమలాపూర్, పోతులమడుగు, ముచ్చింతల, చక్రాపూర్, మహమ్మదాబాద్‌లు పురస్కారాలు వచ్చినవాటిలో ఉన్నాయన్నారు. ఇన్‌చార్జ్ అడిషనల్ కలెక్టర్ యాదయ్య, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి కార్యదర్శులు పాల్గొన్నారు.

పౌష్టికాహారానికి ఇబ్బందులు ఉండరాదు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): అంగన్‌వాడీల సమ్మె నేపథ్యంలో మహిళలు, చిన్నపిల్లలు పౌష్టికాహారానికి ఇబ్బందులు లేకుండా చూడాలని కలెక్టర్ జి.రవినాయక్ అన్నారు. మంగళవారం జిల్లా అధికారులతో వివిధ అంశాలపై సమీక్షించారు. పౌష్టికాహార పంపిణీకి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. గృహలక్ష్మి ఉత్తర్వుల కాపీలను లబ్ధిదారులకు అందజేసేలా చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా వివిధ అంశాలపై చర్చించారు.

అంగన్‌వాడీ కేంద్రాలను తెరిపించిన జెడ్పీ సీఈఓ

బాలానగర్: అంగన్‌వాడీ టీచర్లు సమ్మెబాట పట్టడంతో చిన్నారులకు, బాలింతలు, గర్భిణులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా జెడ్పీసీఈఓ జ్యోతి ప్రత్యేకచర్యలు చేపట్టారు. మంగళవారం మండలకేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగులగొట్టి మరీ తెరిపించారు. చిన్నారులకు, అర్హులకు కోడిగుడ్లు, ఇతర వస్తువులను పంపిణీ చేయించారు. కార్యదర్శి జగన్ ఆధ్వర్యంలో వీఓఏలతో కేంద్రాలను నడిపించేందుకు చర్యలు చేపట్టారు. సీడీపీఓ మెహర్ ఉన్నీసా బేగం, మండల ప్రత్యేక అధికారి బాబురావ్, ఎంపీడీఓ కృష్ణారావు, ఏపీఎం నాగరాజు ఉన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డుల ప్రదానం



అవార్డులు అందజేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రైవేటు పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు మంగళవారం అవార్డులు ప్రదానం చేశారు. ప్రైవేటు పాఠశాలల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మంత్రి శ్రీనివాస్‌గౌడ్ హాజరై ప్రసంగించారు. సమాజం అభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర ఎనలేనిదన్నారు. సంఘానికి జిల్లా కేంద్రంలో 500 గజాల భూమిని వారం రోజుల్లోగా కేటాయిస్తామన్నారు. అదేవిధంగా రూ.20లక్షలు అందజేస్తామని తెలిపారు. 200 మంది ఉపాధ్యాయులను సన్మానించారు. సంగీత నాటక అకాడమీ మాజీ చైర్మన్ శివకుమార్, పీపీ బెక్కం జనార్దన్, రాంచందర్‌జీ, హరినాథ్, సురేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ముఖ్యమంత్రి కేసీఆర్ పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు మోటార్లను ఆన్ చేయగానే సమైక్య పాలనలో ఉమ్మడి జిల్లాకు పట్టిన దరిద్రం అంతా పోతుందని మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఉమ్మడి జిల్లాను సస్యశ్యామలం చేయడమే ముఖ్యమంత్రి ధ్యేయం అన్నారు. మంగళవారం స్థానిక మంత్రి ఫాంహౌస్‌లో కాంగ్రెస్ పార్టీ మైనారిటీ నాయకులు 100 మంది బీఆర్‌ఎస్‌లో చేరిన సందర్భంగా మాట్లాడారు. మున్సిపల్ వైస్ చైర్మన్ గణేష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాజేశ్వర్ పాల్గొన్నారు.

జిల్లావాసికి పురస్కారం

హన్వాడ: ఏపీలోని విజయవాడలో నిర్వహించిన సత్యహరిశ్చంద్ర నాటక పద్యగాన పోటీల్లో జిల్లాకు చెందిన ప్రముఖ రంగస్థల నటుడు వి.నారాయణకు జ్యూరీ పురస్కారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక విశ్వబ్రాహ్మణ నాయకులు హర్షంవ్యక్తం చేశారు. రంగస్థల నటులు తదితరులు ఉన్నారు.

అధ్యక్షుడిగా జితేందర్‌రెడ్డి

గండేడ్: మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా జితేందర్‌రెడ్డి మంగళవారం నియమితులయ్యారు. అంతకుముందు అధ్యక్షుడిగా ఉన్న నరసింహరావును జిల్లా కార్యవర్గంలోకి తీసుకున్నారు. ఈమేరకు డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి జితేందర్‌రెడ్డికి నియామక పత్రం అందజేశారు.

నిధులు మంజూరు

హన్వాడ: శేక్‌పల్లి నుంచి కొమిరెడ్డిపల్లి వరకు అసంపూర్తిగా ఉన్న దారి బీటీగా మారనుంది. మంత్రి శ్రీనివాస్ గౌడ్ ప్రత్యేక చొరవతో రోడ్డుకు రూ.10కోట్లు మంజూరైనట్లు నాయకులు తెలిపారు. ఈ మేరకు ప్రొసిడింగ్ లెటర్‌ను మండల నాయకులకు మంత్రి మంగళవారం అందజేశారు.

కొనసాగుతున్న ధర్నా



అడ్డాకుల: మూసాపేట, అడ్డాకుల మండల కేంద్రాల్లో అంగన్‌వాడీలు చేపట్టిన ధర్నా రెండోరోజు మంగళవారం కొనసాగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

భూత్పూర్: మండలంలో సంఘం జిల్లా అధ్యక్షురాలు పుష్పలత, గౌసియాబేగం, కవిత, రాజ్యలక్ష్మి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

స్టేషన్ మహబూబ్‌నగర్: అంగన్‌వాడీల సమ్మెకు ఐఎన్‌టీయూసీ సంపూర్ణ ఉంటుందని జిల్లా అధ్యక్షుడు రాములుయాదవ్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

జడ్చర్ల టౌన్: అంగన్‌వాడీల సమ్మెలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తెలుగు సత్తయ్య పాల్గొని మాట్లాడారు. సీపీఎం మండల కార్యదర్శి జగన్, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

తడకల బస్టాప్‌లు



దేవరకద్ర రూరల్: మండలకేంద్రంలో ఆర్వోబీ పూర్తి కావడంతో రైల్వే అధికారులు ప్రధాన రహదారిపై రైల్వే గేట్‌ను శాశ్వతంగా మూసివేశారు. దీంతో ఈ మార్గంలో ప్రయాణిస్తున్న బస్సులు స్థానికంగా ఉన్న ఆర్టీసీ బస్టాండ్ లోపలికి రాకుండా నేరుగా ఆర్వోబీపై నుంచి రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రయాణికులు గత్యంతరం లేక ఎండను, వర్షాన్ని భరిస్తూ ఆర్వోబీకి చివర్లలో బస్సుల కోసం నిరీక్షిస్తున్నారు. ఈ క్రమంలోనే రెండు రోజుల క్రితం తడకలతో చిన్న షెడ్లను ఏర్పాటు చేశారు. కాగా అవి వినాయక మండపాలు అని అనుకున్నామని.. బస్టాప్‌లే అని తెలిసి అవాక్కయ్యామని పలువురు పేర్కొన్నారు. వీటిలో ఒకటి మొదటిరోజే గాలికి ఎగిరిపోగా మళ్లీ ఎర్పాటు చేశారని అన్నారు.

తిరుమలలో భజనమండలి

మహమ్మదాబాద్: మండలంకేంద్రానికి చెందిన భజన మండలి భక్తులు మంగళవారం తిరుమలలో అఖండ హరినామ సంకీర్తనలో కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీదుర్గా భజన మండల భక్తులు తదితరులు ఉన్నారు.

జేపీఎస్‌లుగా గుర్తించాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లాలో ఔట్ సోర్సింగ్ పద్ధతిన పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులను వెంటనే జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా గుర్తించాలని నాయకులు వెంకటేశ్‌రాథోడ్, వీరలింగం కోరారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కలెక్టర్ రవి నాయక్‌కు, అడిషనల్ కలెక్టర్ యాదయ్య, డీపీఓ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం సమర్పించారు. ఔట్ సోర్సింగ్ కార్యదర్శులు మంజుల, రమాదేవి, హైమావతి, శివకుమార్, ఆంజనేయులు, రాందాస్, సువర్ణ, వెంకటమ్మ పాల్గొన్నారు.

సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



అప్పంపల్లిలో చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

చిన్నచింతకుంట: సంక్షేమమే బీఆర్‌ఎస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం అప్పంపల్లిలో 120 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. మత్స్యకార్మికుల భవనానికి, సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం ప్రభుత్వం అందించిన చేపపిల్లలను చెరువులో వదిలారు. దాసర్‌సర్‌పల్లిలో హైమాస్ట్‌లైట్లను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నాడన్నారు. అందుకోసమే ఎన్నో సంక్షేమ పథకాలు చేపట్టారని వివరించారు. ఎన్నికల కోసం కాంగ్రెస్, బీజేపీలు అధికారంలోకి వస్తే అవి చేస్తాం, ఇవి చేస్తాం అంటూ మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నాయని.. అలాంటి వారిని నమ్మవద్దని అన్నారు. ఎంపీపీ హర్షవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ వట్టెం రాజేశ్వరి, తహసీల్దార్ సి. కృష్ణయ్య, ఆర్‌ఐ తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

దేవరకద్ర రూరల్: ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి మంగళవారం దేవరకద్రలోని శ్రీ ఈశ్వర వీరప్పయ్య స్వామి దేవస్థానం కల్యాణ మండపం పునర్నిర్మాణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై పూజలు నిర్వహించారు. పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. వెంకటాయపల్లిలో నిర్మిస్తున్న డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల పనులను ఎమ్మెల్యే రెడ్డి పరిశీలించారు. గ్రామంలోని రంగానాయకుల స్వామి ఉత్సవాల సందర్భంగా గ్రామస్తులు వెండితో చేయించిన కిరీటం ఎమ్మెల్యే చేతుల మీదుగా పూజారులకు అందజేశారు. జెడ్పీటీసీ అన్నపూర్ణ, ఎంపీపీ రమాదేవి, పీఏసీఏస్ చైర్మన్ నరేందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

దళితవాడల్లో సర్వే చేస్తాం

మహబూబ్‌నగర్ రూరల్: జిల్లాలో ఉచిత విద్యుత్ వినియోగానికి అర్హులైన దళితులు 26వేల మంది ఉన్నారని, వీరందరికీ జీఓ 342 ప్రకారం 101 ఇవ్వాలని రైతు సంఘం రాష్ట్ర నాయకుడు ఎ.రాములు అన్నారు. కానీ జిల్లా అధికారులు బలవంతంగా డబ్బులు వసూలు చేస్తూ.. మరోవైపు ప్రభుత్వం నుంచి కూడా డబ్బులు తీసుకుంటున్నారని అన్నారు. మంగళవారం కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు పరశురాం అధ్యక్షతన సమావేశంలో మాట్లాడారు. ఉచిత విద్యుత్‌ను 300 యూనిట్ల వరకు పెంచాలని అన్నారు. ఈనెల 14 నుంచి 22 వరకు జిల్లా వ్యాప్తంగా దళితవాడల్లో సర్వే నిర్వహిస్తామని, 23, 25వ తేదీల్లో మండల విద్యుత్ కార్యాలయాల ఎదుట ధర్నాలు చేపడతామని తెలిపారు. కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎం.కుర్మయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు మల్లెల మాణిక్యంరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట్రాములు, సత్యం పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం



మహబూబ్‌నగర్ రూరల్: గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ ప్రభుత్వం పని చేస్తుందని ఎంపీపీ సుధాశ్రీ అన్నారు. మంగళవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సభ్యులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వ కృషితోనే నేడు గ్రామాలు అభివృద్ధి పథంలో పయనిస్తున్నాయని పేర్కొన్నారు. అంతకుముందు ఆయా శాఖల పనితీరుపై సభ్యులు చర్చించారు. అధికారులు నివేదికలను సభలో చదివి వినిపించారు. సర్పంచ్‌లు వారి గ్రామాల్లోని సమస్యలను ప్రస్తావించగా.. అధికారులు సమాధానం ఇచ్చారు. వైస్ ఎంపీపీ కె.అనిత, రైతుబంధు అధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, తహసీల్దార్ సుందర్‌రాజ్, ఎంపీడీఓ జ్యోతి, ఎంపీఓ నరేందర్‌రెడ్డి, పీఆర్ ఏఈ రాములు పాల్గొన్నారు.

గెలుపుపోటములను సమానంగా తీసుకోవాలి



కబడ్డీ ఆడుతున్న బాలికలు

జడ్చర్ల టౌన్: ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో బాదేపల్లి జెడ్పీహైస్కూల్‌లో నిర్వహించిన అర్బన్ స్థాయి క్రీడలు మంగళవారం ముగిశాయి. మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి, కౌన్సిలర్ రఘురాంగౌడ్‌లు చివరిరోజు పోటీలను ప్రారంభించారు. ఈసందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని అన్నారు. పోటీలను పీడీలు రాంకల్యాణ్, శారదాబాయి, పీఈటీలు జగన్‌మోహన్‌గౌడ్, కృష్ణ, రవీంద్రచారి, మోయిన్, ఉమాదేవి, జ్యోతి పర్యవేక్షించారు.

గండేడ్: క్రీడలు వ్యక్తిత్వ వికాసంతో పాటు శారీరక మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయని ఎంపీపీ మాధవి, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వెన్నాచేడ్ మాడల్ స్కూల్‌లో కబడ్డీ పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. సర్పంచ్ పుల్లారెడ్డి, ఎంపీటీసీ రేణుకల తదితరులు పాల్గొన్నారు.

హన్వాడ: మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం ఎస్‌జీఎఫ్ క్రీడలు ప్రారంభమయ్యాయి. ఎంపీపీ బాల్‌రాజు, జెడ్పీకోఆప్షన్ అన్వర్, ఎంఈఓ రాజునాయక్, ఇన్‌చార్జ్ నాగేశ్వర్ పాల్గొన్నారు.

చట్టబద్ధత కల్పించటం బీజేపీ నైతిక బాధ్యత

జడ్చర్ల టౌన్: పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాల్సిన నైతిక బాధ్యత బీజేపీదేనని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి బుర్రి సతీష్ మాదిగ డిమాండ్ చేశారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఒకరోజు దీక్ష చేపట్టారు. ఎమ్మెస్పీ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ జంగయ్యమాదిగ, జిల్లా అధ్యక్షుడు రాజు పాల్గొన్నారు.

కట్నం కోసం వేధింపులు

జడ్చర్ల: అధికకట్నం కోసం వేధిస్తున్నారని మస్రత్ జహ అనే వివాహిత ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు సీఐ రమేష్‌బాబు మంగళవారం తెలిపారు. బాదేపల్లికి చెందిన జహకు కల్వకుర్తికి చెందిన మహ్మద్ నాస్‌తో 2021లో వివాహమయ్యిందన్నారు. కొన్ని నెలలు బాగానే చూసుకున్నా తరువాత భర్తతోపాటు అత్తమామలు రజియా, బాసిత్, ఆడపడుచులు త్రెన్నియల్‌బేగం, నౌశీన్‌బేగం, నామీజబేగంలు రూ.5లక్షలు అధికకట్నం తీసుకురమ్మని వేధింపులకు గురిచేశారని తెలిపిందన్నారు. పెద్దల సమక్షంలో మాట్లాడగా బాగా చూసుకుంటామని రాసిచ్చారని, తిరిగి వేధింపులకు గురిచేశారని అన్నారు. దీంతో ఆమె తల్లితండ్రుల వద్దకు రాగా భర్త, అత్తమామలు వచ్చి గొడవ పడినట్లు వివరించారు. పెద్దలు ఒప్పించి తిరిగి అత్తగారింటికి పంపగా అక్కడ మళ్లీ గొడవలు జరిగాయని దీంతో ఆమె రెండు నెలల క్రితం తిరిగి తల్లిదండ్రుల వద్దకు వచ్చిందన్నారు. అప్పటినుంచి భర్త ఆమెను పట్టించుకోవటం లేదని దీంతో మంగళవారం ఫిర్యాదు చేసిందని వివరించారు.

ఆయుర్వేదంపై అవగాహన



కరదీపికలను పంపిణీ చేస్తున్న డాక్టర్ లావణ్య

అడ్డాకుల: తిమ్మాయిపల్లిలో మంగళవారం ఆయుర్వేద వైద్య శిబిరాన్ని మండల వైద్యురాలు లావణ్య నిర్వహించారు. గ్రామస్తులకు పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. ఆయుర్వేదంపై అవగాహన కల్పించారు. ఆయూష్ కరదీపికలను పంపిణీ చేశారు.

నీట మునిగిన శ్మశానవాటిక



బోడజానంపేట్‌లో నీటిలో శ్మశాన వాటిక

బాలానగర్: బోడజానంపేట్‌లోని దుందుభీనదిలో నిర్మించిన శ్మశాన వాటిక వర్షాలకు నీటమునిగి నిరుపయోగంగా మారుతోంది. దీంతో గ్రామంలో ఎవరూ మరణించినా అంత్యక్రియలు నిర్వహించడానికి ఇబ్బందులు తలెత్తుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఇటీవల మరణించిన వారికి తప్పనిసరి పరిస్థితుల్లో దుందుభీ ఒడ్డున ఖాళీ ప్రదేశంలో అంత్యక్రియలు నిర్వహించినట్లు పేర్కొంటున్నారు. మూడేళ్ల క్రితం రూ. లక్షలు ఖర్చుచేసి నదిలో నిర్మించిన శ్మశాన వాటిక వల్ల గ్రామానికి ఎలాంటి ఉపయోగం లేదని, ప్రభుత్వ నిధులు వృథా అయ్యాయని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు గ్రామస్తులకు ఉపయోగపడేలా అనువైన ప్రాంతంలో శ్మశానవాటిక నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు.

బృందగాన పోటీలు

స్టేషన్ మహబూబ్‌నగర్: భారత్ వికాస్ పరిషత్ పాలమూరుశాఖ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రం పద్మావతీకాలనీలో పాఠశాల విద్యార్థులకు జాతీయబృందగాన పోటీలు నిర్వహించారు. విశేష స్పందన లభించినట్లు అధ్యక్షులు పి.రమేశ్‌చందర్ తెలిపారు. ప్రథమస్థానంలో నిలిచిన వారు ఈనెల 24న జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. శ్యాంప్రసాద్, శంకర్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. పాండురంగం, భూషణ్‌పాండే, వీఎస్‌ఆర్‌కే.ప్రసాద్, చంద్రుడు, 'పాల్గొన్నారు.

ఘన సన్మానం

మహబూబ్‌నగర్ రూరల్: ధర్మాపూర్ ఉన్నత పాఠశాలలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన భీమ్‌రెడ్డిని మంగళవారం ఘనంగా సన్మానించారు. హెచ్‌ఎం శ్రీనివాసులు, పీఆర్‌టీయూ (టీఎస్) జిల్లా అధ్యక్షుడు జి.నారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నీలకంఠుడికి పల్లకీసేవ

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం వీరన్నపేటలోని నీలకంఠస్వామి ఆలయంలో శ్రావణ మాసం పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. మంగళవారం స్వామివారి పల్లకీసేవను వైభవంగా చేపట్టారు. మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

ఘనంగా బోనాలు



మిడ్జిల్: మండల కేంద్రంతో పాటు వాడ్యాల్‌లో మంగళవారం ఈదమ్మ, పోచమ్మ, మైసమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. రైతులు ఎద్దుల బండ్లను, ట్రాక్టర్లను ప్రత్యేకంగా అలంకరించి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఎస్‌ఐ శివనాగేశ్వర్ నాయుడు బందోబస్తు ఏర్పాటు చేశారు.

నేడు లక్ష బిల్వార్చన

నవాబుపేట: లోకిరేవు వీరభద్రస్వామికి బుధవారం లక్ష బిల్వార్చన చేయనున్నట్లు పూజారి లింగయ్యస్వామి తెలిపారు. ఏటా శ్రావణమాసం ముగింపు సందర్భంగా జరిగే ఈ ప్రత్యేక కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వస్తారని వివరించారు.

చట్టాన్ని ఉల్లంఘించరాదు

భూత్పూర్: శాంతియుతంగా పండుగలు నిర్వహించుకోవాలని సీఐ రామకృష్ణ అన్నారు. మంగళవారం భూత్పూర్ లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎస్‌ఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.

మహమ్మదాబాద్: వినాయక విగ్రహాలు ప్రతిష్ఠించే వారు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్‌ఐ సురేష్ మంగళవారం పేర్కొన్నారు.

నవాబుపేట: ఎస్‌ఐ పురుషోత్తం, తహసీల్దార్ మల్లికార్జున్‌రావు మంగళవారం సర్పంచ్‌లతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. వినాయకచవితీ, మీలాదున్నబీ పండుగలను శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. గ్రామాల వారీగా పీస్ కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు గోపాల్‌గౌడ్, యాదయ్య, సత్యం, వెంకటేష్, రఘు, వెంకటేశ్వర్‌రెడ్డి, పురుషోత్తం, అబ్దుల్లా, శంకర్, చెన్నయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరుడికి పూజలు



అడ్డాకుల: కందూర్ రామలింగేశ్వరస్వామిని మంగళవారం జిల్లా అడిషనల్ సెషన్స్ జడ్జి ఆశాలత కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ రమేష్‌గౌడ్ ఆధ్వర్యంలో పండితులు వారికి పూర్ణకుంభ స్వాగతం పలికారు. ప్రధాన ఆలయంలోని శివలింగానికి అభిషేకం చేయించారు. అర్చకులు శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు. సీనియర్ అసిస్టెంట్ అనంతశర్మ, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.